నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, సోమవారం 1 ఏప్రిల్ 2024 | YADADRI BHUVANAGIRI



భువనగిరిలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఘన స్వాగతం



తుంగతుర్తి మండలం వెలుగుపల్లిలో రైతులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, చిత్రంలో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్



# రైతుల కోసం రణరంగమే..

## ఎకరాకు 25వేల పరిహారం ఇవ్వాల్సిందే

## సాగర్ ఆయకట్టుకు నీళ్లిచ్చే తెలివి లేదా..

- నల్లగొండ జిల్లాలో 4లక్షల ఎకరాల పంట ఎండింది
- కేఆర్ఎంబీని కాదని పంటలను కాపాడుకున్నం
- ప్రజలను ఆగం చేస్తే సహించేది లేదు
- రైతు గొంతుకగా బీఆర్ఎస్ కొట్లాడుతది
- రూ.500 బోనస్ కోసం పోరుబాట
- ఎండిన పంటల పరిశీలనలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్



తుంగతుర్తి మండలం ధరావత్ తండాలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను చూసేందుకు పెద్ద ఎత్తున తరలి వచ్చిన జనం

నల్లగొండ ప్రతినిధి, మార్చి 31 (నమస్తే తెలంగాణ) : ఓ వైపు నెత్తిన ఎర్రటి ఎండతో మాడు పగిలే పరిస్థితి ఉన్నా... రైతుల కండ్లు స్వయంగా చూసి, ఆలకించిన బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ రైతుల కోసం ఎంతటి రణరంగానికైనా సిద్ధమని ప్రకటించారు. ఎండిన పొలాలను చూస్తూ రైతుల బాధలను ఆలకించిన కేసీఆర్ చలించిపోయారు. రైతులకు ధైర్యం చెబుతూ.. ఎకరాకు 25వేల పరిహారం ఇచ్చే వరకు కొట్లాటకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. రైతు గొంతుకగా బీఆర్ఎస్ నిలుస్తుందని స్పష్టం చేశారు. సూర్యాపేట జిల్లా వెలుగుపల్లి, ఎర్కారం గ్రామాల్లో ఆదివారం రైతులతో ముచ్చటించారు. దారి పొడువనా ఎండిన పొలాలను చూస్తూ ముందుకు సాగారు. అనంతరం సూర్యాపేట బీఆర్ఎస్ కార్యాలయంలో మీడియా సమావేశంలో కేసీఆర్ మాట్లాడారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ నాగార్జునసాగర్‌లో నీళ్లున్నా ఇవ్వలేక ఎండబెట్టిన చరిత్ర కాంగ్రెస్ సర్కార్‌దని విమర్శించారు. 'రాష్ట్రంలో 15లక్షల పై చిలుకు ఎకరాల్లో పంటలు ఎండినయ్. పంటలు ఎండని జిల్లానే లేదు. ఒక్క నల్లగొండ జిల్లాలోని సాగర్ ఆయకట్టు కలుపుకొని మూడున్నర లక్షల ఎకరాల నుంచి నాలుగు లక్షల ఎకరాల మధ్య పంటలు ఎండాయి. ఆలేరు, భువనగిరి, తుంగతుర్తిలో 25వేల ఎకరాలు.. ఇవి రైతులు చెప్పిన లెక్కనే. సూర్యాపేటలో 24వేల ఎకరాలు... భయకరంగా సాగర్ ఆయకట్టును ఎండబెట్టారు. నాగార్జునసాగర్‌లో ఈ రోజుకు కూడా కనీస నీటిమట్టం కంటే ఏడు టీఎంసీ నీరు ఎక్కువగా ఉంది. దాని కింద కూడా మరో 7 టీఎంసీల నీరు ఉంది. దాదాపు 14 నుంచి 15 టీఎంసీ నీరు ఇప్పుడు కూడా వాడుకునేందుకు అవకాశం ఉంది. ఆనాడు కూడా కేఆర్ఎంబీ ఉండే.. అదేమన్న సూపర్ బాస్‌నా. అది రెండు రాష్ట్రాల మధ్య నీటి పంపిణీకి సమన్వయ కర్త. సాగర్‌ను కేఆర్ఎంబీకి అప్పజెప్పి... తెలివి తక్కవగా చూస్తున్నారు. ఇవ్వాళ నాగార్జునసాగర్ డ్యామ్ మీదకు ఎక్కలేని దుస్థితిని తెచ్చిన అసమర్థ ప్రభుత్వం ఇది. అప్పట్లోనే కేఆర్ఎంబీ ఉన్నా కానీ ఆంధ్రతో పోటీ పెట్టి నీళ్లు తీసుకొచ్చి పంటలు కాపాడిన చరిత్ర బీఆర్ఎస్‌ది. వరుస తడులతో 18 పంటలు పండాయి. ఎందుకు ఇవ్వాళ సాగర్ కింద రైతాంగం తండ్లాడుతున్నది. పట్టుకొమ్మల్లా ఉన్న పల్లెసీమల్లో ఇవ్వాళ బోరుబండ్ల హోరు వినిపిస్తున్నది. గత ఎనిమిదేండ్లుగా బోరు బండ్ల అడ్రస్ లేదు' అని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారం వస్తది పోతది కానీ... ప్రజలను ఆగం చేయొద్దు అని కేసీఆర్ హితవు చెప్పారు. ప్రభుత్వం మెడలు వంచే వరకు వెను దిరిగేది లేదు. ఎండిన పంటకు ఎకరాకు 25వేల రూపాయల పరిహారం ఇచ్చే వరకు ప్రభుత్వాన్ని వెంటాడుతామని కేసీఆర్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ బృందాలు సైతం గ్రామాగ్రామ తిరిగి నష్టం లెక్కలు తీస్తామని, రైతు గొంతుకగా నిలుస్తామని చెప్పారు. రైతాంగాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. ఎర్కారంలో ఒక మహిళా రైతు తన మీద పడి ఏడ్చిందని, నీళ్లు ఇస్తామంటేనే నాట్లు వేసుకున్నామని ఆ మహిళ చెబుతుంటే కండ్లల్లో నీళ్లు తిరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇవ్వాళ కేసీఆర్ వస్తున్నాడని నీళ్లు వదిలారని, ఇదే తెలివి 15 రోజుల కిందట చేసి ఉంటే పంటలు మిగిలేవని తెలిపారు. ఇది వచ్చిన కరువు కానే కాదూ.. ముమ్మాటికీ ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు అని చెప్పారు. కష్టకాలంలో రైతులకు భరోసానిస్తూ వారి పక్షాన నిలబడుతామని స్పష్టం చేశారు.

### బోనస్‌పై పోరుబాట

రుణమాఫీ, బోనస్ సాధన కోసం బీఆర్ఎస్ పోరుబాటను కేసీఆర్ ప్రకటించారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. గతం కంటే ఒక్క కొనుగోలు కేంద్రం తక్కువగా పెట్టినా ఒప్పుకోబోమన్నారు. డిసెంబర్ 9 నుంచే ధాన్యానికి 500 బోనస్ ఇస్తానన్న రేవంత్‌రెడ్డి ఎక్కడ పడుకున్నాడని ప్రశ్నించారు. యాసంగి ధాన్యానికి బోనస్ ఇచ్చే వరకు బీఆర్ఎస్ పోరుబాట పడుతుందని వెల్లడించారు. ఈ నెల 2వ తేదీన అన్ని జిల్లాల్లో కలెక్టర్లకు బోనస్ కోసం బీఆర్ఎస్ నేతలు వినతిపత్రాలు అందించాలని పిలుపునిచ్చారు. అదే విధంగా 6వ తేదీన అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ఒకరోజు దీక్షలు చేపట్టాలని పార్టీ శ్రేణులను కోరారు. కొనుగోలు కేంద్రాల వద్ద కూడా రైతులతో కలిసి బోనస్ కోసం ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధమని ప్రకటించారు. ఏ విషయంలోనైనా రైతులు అధైర్యపడవద్దని, ఆత్మహత్యల వైపు ఆలోచన చేయొద్దని విజ్ఞప్తి చేశారు. అందరం కలిసి ప్రభుత్వంపై యుద్ధం చేద్దామని, రైతుల పక్షాన బీఆర్ఎస్, కేసీఆర్ ఎప్పటికీ అండగా ఉంటారని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, బీఆర్ఎస్ నల్లగొండ, యాదాద్రి జిల్లాల అధ్యక్షులు రమావత్ రవీంద్రకుమార్, కంచర్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సంతోష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, నల్లమోతు భాస్కర్‌రావు, గాదరి కిశోర్‌కుమార్, పైళ్ల శేఖర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బొల్లం మల్లయ్యయాదవ్, కంచర్ల భూపాల్‌రెడ్డి, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులు క్యామ మల్లేశ్‌యాదవ్, కంచర్ల కృష్ణారెడ్డి, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, జడ్పీ చైర్మన్లు ఎలిమినేటి సందీప్‌రెడ్డి, గుజ్జ దీపికాయుగేంధర్‌రావు, నేతలు సోమ భరత్‌కుమార్, చెరుకు సుధాకర్, జడ్పీటీసీ జీడి భిక్షం, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, ఎంపీపీ గుండగాన కవితారాములుగౌడ్, వైస్ ఎంపీపీ మట్టపల్లి శ్రీశైలంయాదవ్, ఎస్ఏ రజాక్, బీఆర్ఎస్ తుంగతుర్తి మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య, మాజీ సర్పంచ్ చింతలపాటి మౌనిక తదితరులు పాల్గొన్నారు.

### వేంపాడుకు పెద్ద ఎత్తున చేరుకున్న రైతులు

నిడమనూరు : మండలంలోని వేంపాడు గ్రామానికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివారం ఎండిన వరి పంటను పరిశీలించి రైతులకు భరోసా కల్పించేందుకు రావాల్సి ఉండగా చివరి నిమిషంలో రద్దయ్యింది. వేంపాడుకు సాయంత్రం 4.30 గంటలకు వచ్చేందుకు షెడ్యూల్ ఖరారు కాగా రైతులతోపాటు పార్టీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు అక్కడికి పెద్ద ఎత్తున చేరుకున్నారు. షెడ్యూల్‌లో భాగంగా సూర్యాపేట లో ఆలస్యమైంది. రోడ్డు మార్గంలో ఇబ్బందులు తలెత్తే అవకాశముండడంతో పర్యటనను రద్దు చేసుకున్నారు. కేసీఆర్ ఒక్కసారి వచ్చి పోతే బాగుండునని రైతులు కోరారు.



తుర్కపల్లిలో కేసీఆర్ రాక కోసం ఎదురుచూస్తున్న మాజీ ఎమ్మెల్యే సునీత, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి

### రైతులను ఓదార్చిన కేసీఆర్

తుంగతుర్తి : తుంగతుర్తి మండల పరిధిలోని వెలుగుపల్లి, మొండికుంట తండాలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎండిపోయిన వరి పంటలను పరిశీలించారు. మొండికుంట తండాలో పంట ఎండిపోయి తీవ్రంగా నష్టపోయిన రైతులు దయ్యాల వెంకటనారాయణ, ఆంగోతు హర్జ, సోమ్లా సైదులు, భూక్యా శ్రీను, ఆంగోతు సాలమ్మ, సురేశ్, ఆంగోతు వెంకన్నను పరామర్శించారు. వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఎండిన వరి కంకులను కేసీఆర్ చేతికి అందించి రైతులు రోదించారు. దుఃఖంలో ఉన్న రైతులకు ఓదార్చి ధైర్యం చెప్పారు. రైతులు ధైర్యంగా ఉండాలని, పోరాడి మన నీళ్లను మనం సాధించుకుందామమన్నారు. 24 గంటల నాణ్యమైన కరెంట్, రైతు రుణమాఫీ, రైతు బంధును తెచ్చుకుందామని భరోసా కల్పించారు.

## బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు జన నీరాజనం

- తుర్కపల్లి నుంచి సూర్యాపేట వరకు సాగిన పర్యటన
- దారి పొడవునా కాన్వాయ్‌కు అభివాదం



భువనగిరిలో కేసీఆర్ రాక కోసం ఎదురుచూస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, జడ్పీచైర్మన్ సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి

యాదాద్రి భువనగిరి, మార్చి 31 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రజలు నీరాజనం పలికారు. ఎండిన పంట పొలాలను పరిశీలించేందుకు జిల్లాకు వస్తున్న గులాబీ దళపతికి బ్రహ్మరథం పట్టారు. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి, భువనగిరి మీదుగా జనగామ జిల్లాకు చేరుకున్నారు. అనంతరం సూర్యాపేట జిల్లాలోని తిరుమలగిరి మండలంలో ప్రవేశించిన అనంతరం తిరుమలగిరి, నాగారం, అర్వపల్లి, వెలుగుపల్లి, తిమ్మాపురం, భాషానాయక్‌తండా, యర్కారం మీదుగా సూర్యాపేట పట్టణానికి కేసీఆర్ చేరుకున్నారు. తుంగతుర్తి మండలం మొండికుంట తండా, వెలుగుపల్లి, సూర్యాపేట మండలం ఎర్కారం గ్రామాల్లో రైతులను కలిసి ఎండిపోయిన పంటలను పరిశీలించారు. జిల్లాలో దాదాపు 40 కిలోమీటర్ల మేర కేసీఆర్ కాన్వాయ్ ప్రయాణించగా ఆయా గ్రామాల్లో రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు, పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి కేసీఆర్‌కు అభివాదం తెలిపారు. కేసీఆర్ కూడా అభివాదం చేస్తూ ముందుకు సాగారు. సూర్యాపేట పట్టణంలో పర్యటించినంతసేపు కేసీఆర్‌కు వీధుల్లో జనం అభివాదం చేశారు. కేసీఆర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి చేరుకొని అక్కడ మధ్యాహ్న భోజనానంతరం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం వద్ద ప్రెస్‌మీట్‌లో పాల్గొన్నారు.

### భువనగిరిలో ఘన స్వాగతం

తుర్కపల్లిలో కేసీఆర్ కాన్వాయ్‌కి బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌తో కలిసి మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులకు ఘన స్వాగతం పలికారు. అభిమానులు భారీగా ఉండటంతో కొద్దిసేపు వాహనాన్ని నిలిపారు. ఈ సందర్భంగా కేసీఆర్ పార్టీ శ్రేణులకు అభివాదం చేశారు. అటు నుంచి కేసీఆర్ భువనగిరి పట్టణానికి చేరుకున్నారు. అక్కడ సైతం కేసీఆర్‌ను చూసేందుకు గులాబీ దళం భారీగా తరలివచ్చింది. పటాకులు కాల్చి, గులాబీ పూలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జై తెలంగాణ, జై కేసీఆర్ నినాదాలతో భువనగిరి పట్టణం మార్మోగింది. బస్సులో నుంచే అభివాదం చేస్తూ ముందుకు నడిచారు. కేసీఆర్‌కు ఘన స్వాగతం పలుకడానికి మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్ రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, రవీంద్రకుమార్, బీఆర్ఎస్ నేతలు దూదిమెట్ల బాలరాజ్ యాదవ్, తుంగ బాలు, జడల అమరేందర్, ఎనబోయిన్ ఆంజనేయులు తరలివచ్చారు.


### మళ్లీ ఆత్మహత్యలు చేసుకునే రోజులు వచ్చినయి

మీరు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే మా పొలాలకు సాగు నీళ్లు మంచిగా వచ్చినయి. పంటలు మస్తుగా పండి సంతోషంగా ఉన్నాం. కాంగ్రెస్ సర్కారు వచ్చిన తర్వాత రైతులకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకునే రోజులు వచ్చాయి. ఎనిమిది సంవత్సరాల నుంచి కాళేశ్వరం సాగు నీళ్లు వస్తున్నాయి. ఈ సారే నీళ్లు రాలేదు. నీళ్లు వస్తాయని ఆశలో 5 ఎకరాల్లో వరి సాగు చేసినం. నీళ్లు లేక పొలం మొత్తం ఎండిపోయింది. 50వేల పెట్టుబడి పెట్టినదంతా పోయింది. పంటలు ఎండిపోవడానికి కారణమైన కాంగ్రెస్ ప్రభుత్వం పోవాలి. ప్రభుత్వంతో నష్టపరిహారం ఇప్పిస్తానని కేసీఆర్ ధైర్యం చెప్పారు.

– కొదమగుండ్ల, సరోజనమ్మ, మహిళా రైతు, ఎర్కారం, సూర్యాపేట మండలం



ఎర్కారంలో ఎండిపోయిన వరి పొలంలో మహిళా రైతు సరోజనమ్మతో మాట్లాడుతున్న మాజి ముఖ్యమంత్రి కేసీఆర్



నిడమనూరు మండలం వేంపాడులో ఎండిన వరి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి



తుంగతుర్తి మండలం వెలుగుపల్లిలో ఎండిన వరితో రైతులు





వెలుగుపల్లిలో రైతులతో మాట్లాడుతున్న కేసీఆర్

### సక్కదనాల పాలనను కాలదన్నుకున్నం

బీఆర్ఎస్ హయాంలో పదేండ్లు బంగారం ఓలే బతికినం. మా జీవితాలు ఇట్లవుతాయని ఎన్నడూ అనుకోలే.. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న చక్కదనాల కాలాన్ని చేతులారా కాలదనుకున్నట్లయ్యింది.. ఎప్పటోలనే కాల్వ నీళ్లు వస్తాయని ఆశ పడి పంటలు సాగు చేసినం. కాంగ్రెస్ పార్టీ వచ్చి కరువు తెచ్చింది. 11 ఎకరాల్లో వరి సాగు చేస్తే నీళ్లు లేక పంట మొత్తం ఎండిపోయింది. కాంగ్రెస్‌ను నమ్ముకుంటే కష్టాలే మిగిలాయి.

– ఆంగోత్ హర్జ, మొండికుంట తండా, తుంగతుర్తి మండలం



### ఎస్సారెస్పీ కాల్వ నీళ్లు రాక 8 ఎకరాల పంట ఎండింది



నాకున్న నాలుగు ఎకరాలతో పాటు మరో ఆరు ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేసిన. 4లక్షలకు పైగా పెట్టుబడి పెట్టిన. ఒక పక్క ఎస్సారెస్పీ జలాలు రాక, మరో పక్క బోర్లు అడుగంటి పోవడంతో 8ఎకరాల వరి పంట ఎండింది. కాంగ్రెస్ పాలనలో రైతులకు కష్టాలు వచ్చాయి. కేసీఆర్ సార్ ప్రభుత్వంపై పోరాటం చేస్తామని చెప్పారు. 25 వేల రూపాయలు పంట నష్ట పరిహారం ఇప్పిస్తామని భరోసా కల్పించారు.

–ధరావత్ సురేశ్, కౌలు రైతు, మొండికుంట తండా, తుంగతుర్తి మండలం

### పంట ఎండి 5 లక్షల నష్టం వచ్చింది..



గడిచిన పదేండ్ల కాలంలో ఇంత కరువు రాలేదు. బోర్లు ఎండిపోయినయి. ఎప్పటి మాదిరిగానే కాల్వ నీళ్లు వస్తాయని పంటలు సాగు చేసినం. తీరా నీళ్లు రాక 15ఎకరాలు సాగు చేస్తే 12 ఎకరాలు పూర్తిగా ఎండింది. 5లక్షలపై పైగా నష్టపోయినం. కేసీఆర్‌తో మా బాధను చెప్పుకున్నాం. రైతులంతా అధైర్యపడొద్దని అండగా ఉంటామని చెప్పిండు.

–ధరావత్ సోమ్లానాయక్, బుజ్జి, మొండికుంట తండా, తుంగతుర్తి మండలం

## కాంగ్రెస్ పాలనలో రైతులకు కన్నీళ్లు

- ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే భగత్
- వేంపాడులో ఎండిన వరి పంటల పరిశీలన



నిడమనూరు మండలం వేంపాడులో ఎండిపోయిన వరి పంటను పరిశీలించి రైతు చిమట శ్రీనుతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్

నిడమనూరు, మార్చి 31 : కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతాంగం కన్నీళ్లు పెడుతున్నదని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. నిడమనూరు మండలంలోని వేంపాడు గ్రామంలో నీళ్లు ఎండిన రైతు చిమట శ్రీనుకు చెందిన వరి పంటను వారు ఆదివారం పార్టీ శ్రేణులతో కలిసి వేర్వేరుగా పరిశీలించారు. వరి సాగుకు పెట్టుబడి వ్యయం, నష్టం తాలూకు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భగత్ మాట్లాడుతూ పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసి రైతాంగాన్ని కడుపులో పెట్టుకుని చూసుకున్నామన్నారు. బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగ ప్రయోజనాలను విస్మరించిందని, ఫలితంగా పంటలు ఎండిపోయి రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారని మండిపడ్డారు. నష్టపోయిన రైతులకు ప్రభు త్వం ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు ప్రయోజనాల పరిరక్షణకు బీఆర్ఎస్ పార్టీ పోరాడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ బొల్లం జయమ్మ, డీసీసీబీ డైరెక్టర్ విరిగినేని అంజయ్య, మాజీ మార్కెట్ చైర్మన్ కామర్ల జానయ్య, వేంపాడు మాజీ సర్పంచ్ అర్వ స్వాతీఅశోక్, ఎంపీటీసీ చిలుముల సంతోశ్‌కుమార్, నాయకులు ఆవుల పురుషోత్తం, భాస్కరి నారాయణ, దరీబు లింగప్ప, అన్నెబోయిన ఏడుకొండల్, నన్నెబోయిన సత్యనారాయణ, రమావత్ రవీందర్ నాయక్ పాల్గొన్నారు.